క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని రోగుల సహాయకులకు బుధవారం అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, పవన్‌కుమార్, రామకృష్ణ, సింధు, ఉమామహేశ్వర్, బాపమ్మ, గునిత్ పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

నార్కట్‌పల్లి : అమరుల ఆశయ సాధన కోసం సీపీఐ (ఎంఎల్)జనశక్తి నాయకులు కృషి చేయాలని అమరుల స్మారక కమిటీ రాష్ట్ర నాయకుడు బొమ్మకంటి కొమరయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని పల్లెపహాడ్ గ్రామంలో భరత్, పజ్జూరి కృష్ణారెడ్డి, రాజుల 23వ వర్ధంతిని పురస్కరించుకుని స్మారక స్థూపాల వద్ద జెండా ఎగురవేసి నివాళులర్పించి మాట్లాడారు. అరుణోదయ కళాకారులు మల్సూర్, సురేష్, రాకేష్, సుధాకర్, విశాల, అరుంధతి, అమరుల స్మారక కమిటీ సభ్యులు బంటు రామలింగయ్య, సంజీవరెడ్డి, సత్తయ్య, మంగమ్మ, వెంకన్న, గురువయ్య, మల్లయ్య, నాగరాజు, జాని, యాకన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో ట్రాన్స్ కో అధికారుల పరిశీలన

నల్లగొండ టూటౌన్ : పానగల్ రోడ్డులోని శ్రీనగర్‌కాలనీ, ఎన్‌జీఓస్ కాలనీల్లో ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, డీఈ సుధీర్‌కుమార్, ఏడీ శంకరయ్య, ఇతర అధికారులు బుధవారం పర్యటించి స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, కొన్ని కరెంట్ పోల్స్ తొలగింపు తదితర సమస్యలపై సంబంధిత స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. త్వరలోనే విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. వారి వెంట మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ కొండూరు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న సైదులు

మునుగోడు : మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన పగిళ్ల చెన్నయ్య–సుగుణమ్మ దంపతుల చిన్న కుమారుడు శంకర్ తీవ్ర అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు నగదు లేకపోవడంతో ఆ దంపతులు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహాయం కోరారు. స్పందించిన రాజగోపాల్‌రెడ్డి రూ. 50 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం బీజేపీ మండల అధ్యక్షుడు సైదులు ద్వారా శంకర్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పగిళ్ల నగేష్, రాజు తదితరులు ఉన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ : మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల కమలమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఐతగోని వెంకటయ్యగౌడ్. కమలమ్మ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. వార్డు మెంబర్ ఏర్పుల వెంకన్న, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వరికుప్పల వెంకటయ్య, బుర్కల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

కట్టంగూర్ : విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని నల్లగొండ ఆర్డీఓ రవి ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి చిన్నపురి గ్రామంలో గల మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల భవన యాజమాన్యాన్ని ఆదేశించారు. బుధవారం చిన్నపురి గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్, అసంపూర్తిగా ఉన్న ప్రహరీ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కట్టంగూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ కుమార్ రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజారాం , సిబ్బంది ఉన్నారు.

బాలల పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

కనగల్ : బాలల పరిరక్షణ కమిటీ పోస్టర్‌ను బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కరీంపాష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, శారీరక మానసిక వేధింపులు, బాలలతో భిక్షాటన, బాలికల పట్ల వివక్ష, లైంగిక వేధింపులు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఏఓ అమరేందర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ అయితగోని యాదయ్యగౌడ్, బాలల పరిరక్షణ కమిటీ జిల్లా సభ్యులు రేవతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మంజుల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశాలు

- గైర్హాజరవుతున్న ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు
- కోరం కోసం గంటల తరబడి ఎదురుచూపులు
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు

కేతేపల్లి : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలకు పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, డుమ్మా కొడుతున్నారు. ఫలితంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోక సమావేశాల లక్ష్యం నీరుగారుతోంది. ప్రతి సమావేశానికి జెడ్పీ చైర్మన్‌తోపాటు, మండలంలోని సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ఇతర ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రాలు అందజేస్తున్నారు. 17 అంశాలపై చర్చించడానికి కలెక్టర్‌తోపాటు 32 మంది అధికారులు హాజరుకావాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరైన సందర్భాల్లో మాత్రమే సమస్యలు ప్రస్తావనకు వస్తున్నాయి. ఇతర సందర్భాల్లో సమావేశాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.

సమావేశాలకు కిందిస్థాయి సిబ్బంది

సమావేశాలకు హాజరుకాని అధికారులపై, ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు లేకపోవడంతో సమావేశాలకు హాజరయ్యే విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఒక్కోసారి సభ్యులకు ఫోన్ చేసి బతిమాలి మరీ పిలిపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇక కొంతమంది మండల స్థాయి అధికారులు సమావేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు రాకుండా తమ కిందిస్థాయి సిబ్బందిని సమావేశాలు పంపించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గత సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను తెలియజేసే నివేదికలను సమర్పించడం లేదు. కేవలం తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సమావేశాల్లో చదివి వినిపించి మమ అనిపిస్తున్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధి (ఫైల్)

చర్చలో మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర శూన్యం

సర్వసభ్య సమావేశంలో పాల్గొనే మహిళా ప్రజాప్రతినిధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మహిళా ప్రతినిధుల్లో ఒకరిద్దరు సభ్యులు మినహా మిగతా సభ్యులు నోరు విప్పడం లేదు. కేతేపల్లి మండలంలో 16 మంది సర్పంచుల్లో 8 మంది మహిళలు, 11 మంది ఎంపీటీసీల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఇందులో ఇద్దరు ముగ్గురు సర్పంచులు, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు మినహా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎవరూ లేవనెత్తడం లేదు. కొందరు సభ్యులు అధికార పార్టీలో ఉన్నామనే భావనతో ఏం మాట్లాడితే తమకేమి ఇబ్బందులు ఎదురవుతాయో అని మిన్నకుండిపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మండల సర్వసభ్య సమావేశంలో చర్చకు రాక పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సమస్యలు పరిష్కారం కావడం లేదు



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న మండల సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. గత సమావేశాల్లో చేసిన తీర్మానాలపై సమీక్ష జరగడం లేదు. మండల స్థాయి అధికారులు మినహా జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాజరు కావడం లేదు. సమస్యలు ప్రస్తావించినప్పటికీ పరిష్కారం కావడం లేదు.

–ఎడ్ల సంధ్య, ఎంపీటీసీ, కొర్లపహాడ్

అందరికీ ఆహ్వానం అందజేస్తున్నాం



ప్రజాప్రతినిధులకు, అధికారులకు అందరికీ సర్వసభ్య సమావేశాలకు సంబంధించి ఆహ్వాన పత్రాలు అందజేస్తున్నాం. సమావేశానికి నివేదికలతో రావాలని ఆదేశాలు జారీ చేస్తున్నాం. అయినా కొందరు మండల స్థాయి అధికారులు సమావేశాలకు రాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం.

–లక్ష్మారెడ్డి, ఎంపీడీఓ, కేతేపల్లి

చెరువులకు హద్దులు ఏర్పాటు చేయాలి

నార్కట్‌పల్లి : గ్రామాల్లో చెరువులు ఆక్రమణకు గురికాకుండా సంబంధిత శాఖ అధికారులు రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని హద్దులు (ఎఫ్‌టీఎల్) ఏర్పాటు చేయాలని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను సమర్పించారు. మండలంలో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉన్నాయని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమాధానం ఇచ్చేందుకు సంబంధిత శాఖ ఏఈ సమావేశానికి హాజరుకాకపోవడంతో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి జోక్యం చేసుకుని ఫోన్‌లో విద్యుత్ డీఈతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఎంపీటీసీ మేకల రాజిరెడ్డితోపాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ నాణ్యతలేని ఎరువులు విక్రయిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏఈకి చెబితే స్పందించడం లేదన్నారు. జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు మంజూరైన నిధులతో త్వరలో పనులు చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, ఎంపీడీఓ గుండగోని యాదగిరి, తహసీల్దార్ పుల్లి సైదులు, ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, చిరుమర్తి యాదయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, అంజయ్య, భాగ్యమ్మ, కనకమ్మ, జయలక్ష్మి, సర్పంచ్‌లు గోసుల భద్రాచలం, కర్నాటి ఉపేందర్, చంద్రశేఖర్, శంకర్, నర్సింహ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కరీంపాష

కనగల్ : అధికారులు ప్రజాప్రతినిధులకు జవాబుదారిగా పనిచేస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కరీంపాష అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కరీంపాష అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి తీర్మానాలు లేకుండానే సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కనగల్ ఎక్స్‌రోడ్డులో మిషన్ భగీరథ నీరు రాక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ పాలకూరి సైదులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు వరి, పత్తికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని హార్టికల్చర్ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి పేర్కొన్నాడు. చెరువు కట్టలకు ఇరువైపులా కంపచెట్లు మొలిచి ప్రమాదకరంగా ఉన్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సమావేశంలో పేర్కొన్నారు. జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎస్ఐ అంతిరెడ్డి, ఏఓ అమరేందర్‌గౌడ్, సర్పంచ్ అయితగోని యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

నల్లగొండ టూటౌన్ : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఇంకుడు గుంతల పరిశీలన

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల, ఆరెగూడెం గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో నిర్మించిన ఇంకుడు గుంతలను డీఆర్‌డీఓ కాళిందిని బుధవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో గ్రామ ప్రగతి కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ పథకాల అమలుతీరును ఎంపీడీఓ బి.లాజర్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న వైకుంఠ ధామాల నిర్మాణాలతోపాటు ఇతర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మహాసభకు తరలిరావాలి



చైతన్య యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్ : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు రెండో వారంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు ప్రతి ఇంటికి ఇద్దరు చొప్పున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కందుల సోమన్నమాదిగ, కో ఇన్‌చార్జ్ బోడ సునిల్ పిలుపునిచ్చారు. మహాసభ విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం చర్లపల్లి, అన్నెపర్తి, మర్రిగూడెంలో చైతన్య యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో ఉన్న 59 ఉప కులాలకు సామాజిక న్యాయం జరగాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ చిన్న, ఇరిగి శ్రీశైలం, లింగస్వామి, నవీన్, నర్సింహ, బొజ్జ దేవయ్య, జలందర్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో మర్రిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులకు ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 50 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేబర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పజ్జూరి కృష్ణారెడ్డికి నివాళి

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో బుధవారం గోదావరి లోయ ప్రతిఘటనోద్యమ నాయకుడు పజ్జూరి కృష్ణారెడ్డి 23వ వర్ధంతిని నిర్వహించారు. అంబటి చిరంజీవి, మామి డోజు వెంకన్న, పుట్ట సత్యం, చెరుకు సైదులు, పుట్ట కళమ్మ, జానపాటి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల చేతిలో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదు

కట్టంగూర్ : వ్యవసాయానికి విద్యుత్ మూడు గంటలే చాలన్న కాంగ్రెస్ పార్టీకి రైతుల చేతిలో భంగపాటు తప్పదని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు యుద్ధ వేదిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయానికి సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక లేనిపోని ఆరోపణలు చేస్తోందన్నారు. వ్యవసాయంపై అవగాహన లేక టీ పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాతున్నారన్నారు. రైతులను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు నార్కట్‌పల్లి క్యాంపు కార్యాయలంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల కోఆర్డినేటర్ గుండగోని రాములు, రైతు సంఘం మండల అధ్యక్షుడు చిట్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పాలడుగు హరికృష్ణ పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో యనమల్ల నర్సింహ, భాస్కర్, జగదీశ్, నాగరాజు తదితరులు ఉన్నారు.



కట్టంగూర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి చెందాలి

చిట్యాల : నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి పెంపొందించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలలో పీజేఆర్ రాఖీ తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఖీ తయారీ కేంద్రం ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న నిర్వాహకులు ప్రద్దుటూరి శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌ను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, వనమా వెంకటేశ్వర్లు, గుండె బోయిన సైదులు, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, పందిరి గీత, సిలివేరు మౌనిక, రెముడాల లింగస్వామి, పొన్నం లక్ష్మయ్య, జిట్ట చంద్రకాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

నల్లగొండ క్రైం : విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆర్ఐ సంతోష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్కలేటర్‌పై విద్యార్థులను ఉంచి అతివేగంతో జరిగే ప్రమాదాలు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి నడిపితే జరిగే ప్రమాదాలు, నిద్రమత్తులో జరిగే ప్రమాదాలు, ర్యాష్ డ్రైవింగ్, ఓవర్‌టెక్‌తో జరిగే ప్రమాదాలు, సిగ్నల్ జంప్, రాంగ్‌రూట్‌లో వెళితే జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంపత్, ఏఎస్ఐ జహీంగీర్, కాంతరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ సంతోష్

రైతుల సంక్షేమమే పీఏసీఎస్ లక్ష్యం



చెక్కు అందజేస్తున్న కుంభం శ్రీనివాస్ రెడ్డి

మునుగోడు : రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలతోపాటు బ్యాంకు రుణాలు అందిస్తూ రైతు కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే పీఏసీఎస్ ప్రధాన లక్ష్యమని డీసీసీబీ డైరెక్టర్, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మునుగోడు పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన మునుగోడు పట్టణానికి చెందిన రైతు జిట్టగోని మారయ్య ప్రమాదవశాత్తు ఇటీవల మరణించాడు. ఆయనకు జనతా పర్సనల్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన లక్ష రూపాయల విలువ గల చెక్కును బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు శ్రీనివాస్ రెడ్డి అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సుఖేందర్ పాల్గొన్నారు.

ఆలయంలో చండీయాగం

నల్లగొండ రూరల్ : జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు మర్రిగూడెంలో గల కల్యాణ కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం చండీయాగం నిర్వహించారు. అభిషేకం, గణపతి పూజ, పుణ్యవచనం, అఖండ దీపారాధన, చక్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. చర్లపల్లి, ఆర్జాలబావి, మర్రిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు చండీయాగంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు జేరిపోతుల సైదులుగౌడ్–పద్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్తిక్ గౌడ్, శ్రీదుర్గ, సురిగి మారయ్య, కలగోని శ్రీనివాస్, సురిగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న భక్తులు

విద్యార్థులకు షూ పంపిణీ



షూ అందజేస్తున్న ఎంఈఓ అరుంధతి

నల్లగొండ : మున్సిపాలిటీ పరిధిలోని కతాల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తరాల పరమేశ్‌యాదవ్ బాల్యమిత్రుడు మాలి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు సుమారు రూ.30 వేల విలువగల షూ, సాక్స్‌ను ఎంఈఓ అరుంధతి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత మాలి ప్రభాకర్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు తరాల పరమేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు కంకణాల నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ దండెంపల్లి సత్తయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఊబిది యాదయ్య, వైస్ చైర్మన్ పామనగుండ్ల కళావతి, వార్డు పెద్దలు దండెంపల్లి సత్తయ్య, షేక్ లతీఫ్, ఆనంద్, సామ్యేల్, సీఆర్పీలు జానయ్య, రాధిక తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులపై వివక్ష చూపుతున్న ప్రభుత్వం

నల్లగొండ రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ సత్యనారాయణ అన్నారు. బుధవారం నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఎల్లేష్, నాగమణి, రేణుక, యాదయ్య, అనిల్, భద్రయ్య, సైదులు, శ్రీశైలం, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జీపీ కార్మికులు భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కరీంపాష కార్మికులకు నగదు అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి, జిల్లా విజయ్, కొంగల నర్సింహ, దాసరి కిరణ్, ముద్దం లింగయ్య, బాలమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, క్రిష్ణయ్య, భిక్షం తదితరులున్నారు.

కట్టంగూర్ : తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 14వ రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పొన్న అంజయ్య, కార్మికులు తాటి కొండయ్య, వెంకన్న, పల్లె జానయ్య, గుడుగుంట్ల వెంకటయ్య, రత్నం, నర్సింగు శ్రీను, రాంబాబు ఉన్నారు.



నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

21న కలెక్టరేట్ ముట్టడి

చండూరు : ఈ నెల 21న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం చండూరు మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ కల్లుగీత సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జేరిపోతుల ధనంజయ, సీఐటీయూ మండల కన్వీనర్ మోగదాల వెంకటేశం, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఏర్పుల సైదులు, బీఎస్పీ మండల అధ్యక్షుడు నేరెళ్ల ప్రభుదాసు, ఐఎన్‌టీసీ మండల అధ్యక్షుడు రఫిక్, మాల మహానాడు మండల అధ్యక్షుడు మేడిపల్లి లక్ష్మణ్, రాములమ్మ, పుల్లమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పూల వెంకటయ్య డిమాండ్ చేశారు. జీపీ కార్మికులు 14రోజులుగా చేస్తున్న సమ్మెకు అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంఘీభావం తెలిపి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అఖిలపక్ష నేతలు నాంపల్లి సంజీవ, గడ్డం శ్రీను, నాంపల్లి చంద్రమౌళి, ఊరుపాక వెంకటయ్య, గాదెపాక నాగరాజు, సాయిరాం, రాంబాబు, రమేష్, మొగుదాల పార్వతమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె బుధవారం 14వ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. వట్టిపల్లి హన్మంతు, లింగయ్య, మంజుల, రాములు, రమేష్, పద్మ, శ్రీను, యాదమ్మ, నర్సింహ, రాములమ్మ, మహేష్, సునీత పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడం అభినందనీయం

నల్లగొండ టూటౌన్ : నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలో జాతీయ వికలాంగుల హక్కుల పోరాట సమితి సదస్సుకు హాజరైన మంద కృష్ణ మాదిగ.. ప్రకాశం బజారులోని నాగం హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు చేస్తున్న సేవా వివరాలను మంద కృష్ణమాదిగకు నాగం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి వివరించారు. వికలాంగుల హక్కుల సదస్సుకు హాజరైన 1200 మందికి నాగం వర్షిత్‌రెడ్డి భోజనం ఏర్పాటు చేశారు.



మంద కృష్ణమాదిగను సత్కరిస్తున్న వర్షిత్‌రెడ్డి

ఆలయం వద్ద అధ్వానంగా రహదారి



ఆలయం ఎదురుగా చిత్తడిగా మారిన రహదారి

కనగల్ : నిత్యం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయే మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద చిన్నపాటి వర్షానికే నల్లగొండ–దేవరకొండ ప్రధాన రహదారి చిత్తడి మారుతోంది. ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉండడంతో భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకునే క్రమంలో ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనే రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారు కావడంతో ఎర్రమట్టి పోసి తాత్కాలికంగా గుంతలను పూడ్చారు. దీంతో ఆ మట్టి తేలికపాటి వర్షానికి కొట్టుకుపోయింది. సంబంధిత అధికారులు పట్టించుకుని ఆలయానికి ఇరువైపులా ఉన్న బీటీ రోడ్డును సీసీగా మర్చాలని భక్తులు కోరుతున్నారు.

పోరాట ఫలితమే ఏరియర్స్

చండూరు : సమ్మె పోరాట ఫలితంగా చండూర్ మున్సిపల్ కార్మికుల ఏరియర్స్ సాధించుకున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌తో చర్చలు జరిపిన అనంతరం ఆయన మాట్లాడారు. సకాలంలో మున్సిపల్ కార్మికులకు ఏరియర్స్ ఇవ్వకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారని అన్నారు. ఏడు రోజులుగా కొనసాగిన సమ్మె బుధవారం నుంచి విరమించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చొరవతో కార్మికులకు 10 నెలల ఏరియర్స్ అందనున్నాయని పేర్కొన్నారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ధనంజయగౌడ్, సీఐటీయూ మండల కన్వీనర్ మోగుదాల వెంకటేశం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కత్తుల సైదులు, ఉపాధ్యక్షుడు లింగస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

పాడిగేదెపై వీధి కుక్కల దాడి

మునుగోడు : కచలాపురం గ్రామానికి చెందిన మారెడ్డి మోహన్‌రెడ్డికి చెందిన పాడిగేదెపై వీధి కుక్కలు బుధవారం దాడి చేసి గాయపరిచాయి. వ్యవసాయ బావి వద్ద కట్టేసిన గేదెపై దాదాపు 10కి పైగా కుక్కలు దాడికి పాల్పడ్డాయి. దీంతో ఆ రైతు పశు వైద్య సిబ్బందితో గేదెకు చికిత్స చేయించాడు.